www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 10 డిసెంబర్ 2024
5
ఏలూరు



కలెక్టరేట్ వద్ద ఎఐఎస్ఎఫ్ ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ చదువుతున్న విద్యార్థులకు పెండింగులో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన సొమ్ము విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.శివ కుమార్, యర్రా మధు మాట్లాడారు.



ధర్నాలో నినదిస్తున్న విద్యార్థులు

పిడిఎఫ్ హ్యాట్రిక్ విక్టరీ



- ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల్లో గోపీమూర్తి ఘనవిజయం
- మొదటి ప్రాధాన్యత ఓట్లతోనే ప్రత్యర్థికి ముచ్చెమటలు
- పోలైన 15,494 ఓట్లలో 9,165 ఓట్లను సాధించిన గోపీమూర్తి
- ప్రత్యర్థి గంధం నారాయణరావుపై 3,906 ఓట్లు మెజార్టీతో గెలుపు
- అన్ని రౌండ్లలోనూ కొనసాగిన ఆధిక్యం

ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల్లో పిడిఎఫ్ హ్యాట్రిక్ విక్టరీ నమోదు చేసింది. ఎన్నిక ఏదైనా తమదే విజయమని పిడిఎఫ్ మరోసారి ఢంకా మోగించింది. ప్రత్యర్థులు ఎన్ని కుయుక్తులు పన్నినా ఉపాధ్యాయ, అధ్యాపకులంతా యుటిఎఫ్ బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థికే జై కొట్టారు. మొదటి ప్రాధాన్యతా ఓట్లతోనే ఉద్యమనేత, పిడిఎఫ్ అభ్యర్థి బొర్రా గోపీమూర్తి అఖండ విజయం సాధించారు. ప్రత్యర్థులు ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా తామంతా ఒక్కటే అంటూ ఉభయ గోదావరి జిల్లాల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకులంతా మరోసారి చెప్పకనే చెప్పిన పరిస్థితి నెలకొంది. సోమవారం జరిగిన ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉప ఎన్నిక కౌంటింగ్‌లో ప్రతి రౌండ్‌లోనూ పిడిఎఫ్ అభ్యర్థి మెజార్టీ ఓట్లు దక్కించుకుని విజయ దుందుభి మోగించడంతో ఉపాధ్యాయుల్లోనూ, జిల్లా ప్రజానీకంలోనూ హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉత్కంఠభరితంగా సాగిన ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉప ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి బొర్రా గోపీమూర్తి సునాయాసంగా విజయం సాధించారు. ఈ నెల ఐదో తేదీన ఉపాధ్యాయ ఎంఎల్‌సి పోలింగ్ జరిగింది. పూర్వపు ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలోని 116 కేంద్రాల్లో 92.62 శాతం పోలింగ్ నమోదైంది. ఈ ఎన్నికల్లో ఐదుగురు అభ్యర్థులు పోటీ పడ్డారు. మొత్తం 16,737 మంది ఓటర్లుండగా 15,502 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఏలూరు జిల్లాలో 2,667 మంది ఓటర్లు ఉండగా 2,443 ఓట్లు 91.60 శాతం పోలయ్యాయి. పశ్చిమలో 3,724 ఓట్లకుగాను 3,478 ఓట్లు 93.27 శాతం పోలింగ్ నమోదైంది. సోమవారం ఉదయం కాకినాడలో ఓట్ల లెక్కింపు ప్రారంభమవ్వగా మధ్యాహ్నానికే గోపీమూర్తి గెలుపు ఖాయమని తేలిపోయింది. మొత్తం పోలైన ఓట్లలో 814 ఓట్లు చెల్లనివిగా అధికారులు ధ్రువీకరించారు. 14,680 ఓట్లు చెల్లుబాటవ్వగా గోపీమూర్తి 9,165 ఓట్లు దక్కించుకుని విజయం సాధించారు. ప్రధాన ప్రత్యర్థి గంధం నారాయణరావుకు 5,259 ఓట్లు వచ్చాయి. దీంతో గోపీమూర్తి 3,906 ఓట్ల మెజారిటీని సాధించారు. 14 టేబుళ్లపై లెక్కింపు ప్రక్రియ జరగ్గా గోపీమూర్తికి ఆద్యంతం ఆధిక్యం కొనసాగడం విశేషం. 26 ఏళ్లపాటు పలు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక ఉద్యమాల్లో ముందు పీఠిన నిలిచిన బొర్రా గోపీమూర్తి శాసన మండలి సభ్యునిగా ఎన్నికయ్యారు. పిడిఎఫ్ అభ్యర్థులు వరుసగా రాము సూర్యారావు, షేక్ సాబ్జీ, గోపీమూర్తి వరుసగా గెలిచి హ్యాట్రిక్ నమోదు చేశారు.

లెక్కింపు సాగిందిలా..

ఎన్నికల పరిశీలకులు కె.హర్షవర్ధన్, ఆర్‌ఒ షాన్మోహన్, కాకినాడ ఆర్‌డిఒ ఎస్.మల్లిబాబు పర్యవేక్షణలో కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు మధ్య కౌంటింగ్ సిబ్బంది సోమవారం ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రారంభించారు. ఉదయం 11 గంటలకు కట్టలు కట్టడం పూర్తయింది. 11.30 గంటల నుంచి మొదటి ప్రాధాన్యతా ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. తొలి రౌండ్‌లోనే యుటిఎఫ్ బలపర్చిన పిడిఎఫ్ అభ్యర్థి బొర్రా గోపీమూర్తి విజయం ఖాయమైంది. 814 చెల్లని ఓట్లుగా అధికారులు గుర్తించారు. చెల్లని ఓట్లు తీసివేస్తే మిగిలిన ఓట్లలో 50 శాతం ఓట్లు సాధించిన అభ్యర్థి విజయం సాధిస్తారు. మొదటి ప్రాధాన్యతా ఓట్ల లెక్కింపులో భాగంగా యుటిఎఫ్ బలపర్చిన అభ్యర్థి గోపీమూర్తికి 50 శాతం ఓట్లు దాటడంతో గెలుపు ఖాయమైంది. గోపీమూర్తికి 9,165 ఓట్లు రాగా, సమీప ప్రత్యర్థి గంధం నారాయణరావుకు 5,259 ఓట్లు మాత్రమే వచ్చాయి. తర్వాత స్థానంలో పులుగు దీపక్‌కు 102, నామన వెంకటలక్ష్మికి 81, కవల నాగేశ్వరరావుకి 73 మొదటి ప్రాధాన్యత ఓట్లు వచ్చాయి. అత్యధిక ఓట్లు సాధించిన పిడిఎఫ్ అభ్యర్థి బొర్రా గోపీమూర్తిని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ షాన్మోహన్ విజేతగా ప్రకటించారు. గెలుపొందినట్లు ధ్రువపత్రాన్ని అందించారు.


గోపీమూర్తిని అభినందిస్తున్న ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు, యుటిఎఫ్ రాష్ట్ర నేతలు

అభ్యర్థులకు వచ్చిన ఓట్లు ఇలా..

అభ్యర్థి	వచ్చిన ఓట్లు
బొర్రా గోపీమూర్తి	9,165
గంధం నారాయణరావు	5,259
పులుగు దీపక	102
డాక్టర్ నాగేశ్వరరావు	73
నామన వెంకటలక్ష్మి	81
చెల్లిన ఓట్లు	14,680
చెల్లని ఓట్లు	814
మొత్తం ఓట్లు	15,494

విజయోత్సవ ర్యాలీ

ఓట్ల లెక్కింపు పూర్తయిన వెంటనే పలువురు ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల ప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు, గ్రాడ్యుయేట్స్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు, యుటిఎఫ్ నేతలంతా జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల వద్దకు చేరుకున్నారు. మొదటి ప్రాధాన్యత ఓట్లతో ఘన విజయాన్ని సాధించిన గోపీమూర్తికి స్వాగతం పలికారు. పూలమాలలు వేసి ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు. జెఎన్‌టియు నుంచి భానుగుడి, టూటౌన్, కలెక్టరేట్ సెంటర్ల మీదుగా ఇంద్రపాలెం లాకుల వద్ద గల యుటిఎఫ్ హోమ్ వరకూ విజయోత్సవ మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. పిడిఎఫ్ జిందాబాద్ అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. పెద్దఎత్తున బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

సాబ్జీ మృతితో ఉప ఎన్నిక

రాష్ట్రంలో పూర్వపు ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ నియోజకవర్గ ఎంఎల్‌సిగా పిడిఎఫ్ అభ్యర్థి షేక్ సాబ్జీ 2021 మార్చి 30న గెలుపొందారు. ఆయన పదవీకాలం 2027 మార్చి 29 వరకు ఉంది. అయితే 2023 డిసెంబర్ 15న ఏలూరులో అంగన్‌వాడీ సమ్మెలో పాల్గొని అక్కడి నుంచి భీమవరం వెళ్తుండగా పశ్చిమగోదావరి జిల్లా ఉండి మండలం చెరుకువాడ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సాబ్జీ అక్కడికక్కడే మృతి చెందారు. దీంతో ఉప ఎన్నిక అనివార్యమైంది.

పెరిగిన మెజార్టీ

2021లో జరిగిన ఎంఎల్‌సి ఎన్నికల్లో గెలుపొందిన షేక్ సాబ్జీ కంటే ఇప్పుడు గెలుపొందిన బొర్రా గోపీమూర్తి ఎక్కువ మెజార్టీ సాధించారు. ఆ ఎన్నికల్లో 17,467 ఓట్లకుగాను 16,054 ఓట్లు పోలయ్యాయి. అందులో యుటిఎఫ్ తదితర సంఘాలు బలపరిచిన షేక్ సాబ్జీకి 7,987 ఓట్లు వచ్చాయి. తన సమీప ప్రత్యర్థి, గంధం నారాయణరావుకు 6,453 ఓట్లురాగా, సాబ్జీ 1,534 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అప్పుడు టిడిపి మద్దతిచ్చిన అభ్యర్థి చెరుకూరి సుభాష్ చంద్రబోసుకు 106 ఓట్లు, బిజెపి మద్దతిచ్చిన ఇళ్ల సత్యనారాయణకు 300 ఓట్లు వచ్చాయి. ఈసారి ఓట్లు తగ్గినప్పటికీ మెజార్టీ 3,906 ఓట్లకు పెరిగింది.


ఎంఎల్‌సిగా ఎన్నిక ధ్రువపత్రాన్ని అందుకుంటున్న గోపీమూర్తి

పింఛన్‌దారుల్లో గుబులు..!

ఏరివేతకు ప్రత్యేక బృందాలు

పైలెట్ ప్రాజెక్టుగా రెండు జిల్లాల్లో ఒక్కో గ్రామం ఎంపిక

ప్రారంభమైన ప్రత్యేక బృందాల తనిఖీ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, కాళ్ల, ఆగిరిపల్లి

సామాజిక పింఛన్ల ఏరివేతకు ప్రభుత్వం నడుం బిగించింది. జిల్లాకో గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంచుకుంది. ఏలూరు జిల్లాలో ఆగిరిపల్లి మండలం సూరవరం గ్రామం, పశ్చిమలో కాళ్ల మండలం ప్రాతాళ్లమెరక గ్రామంలో సోమవారం పింఛన్ల తనిఖీ ప్రారంభమైంది. ఆగిరిపల్లి మండలం సూరవరం గ్రామంలో మొత్తం 423 పింఛన్లు ఉన్నాయి. కాళ్ల మండలం ప్రాతాళ్ల మెరకలో 416 మంది పింఛన్లు అందుకుంటున్నారు. పింఛన్ల తనిఖీకి సంబంధించి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. గ్రామాన్ని 12 క్లస్టర్లుగా విభజించి 40 పింఛన్లకు సంబంధించి ఒక బృందాన్ని నియమించారు. అదే మండలానికి చెందిన సిబ్బందిని కాకుండా వేరే మండలానికి చెందిన ఎంపిడిఒ, కార్యాలయ సిబ్బంది, వెల్ఫేర్ అసిస్టెంట్లను నియమించారు. కాళ్ల మండలం ప్రాతాళ్లమెరకలో పింఛన్ల తనిఖీకి ఉండి, ఆకివీడు మండలాల సిబ్బంది వెళ్లారు. ఆగిరిపల్లి మండలం సూరవరం గ్రామంలో పింఛన్ల తనిఖీలో నూజివీడు, చాట్రాయి, ముసునూరు మండలాలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు. తొలిరోజు సోమవారం ప్రాతాళ్లమెరకలో మొత్తం 416 పింఛన్లకుగాను 388 పింఛన్ల తనిఖీ పూర్తయ్యింది. సూరవరంలో 423 పింఛన్లకుగాను 410 పింఛన్లకు సంబంధించి సర్వే పూర్తయ్యింది. మంగళవారం మిగిలిన పింఛన్ల తనిఖీ పూర్తి చేయనున్నారు. పింఛన్ల తనిఖీ సర్వేకోసం ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. ఇందులో ప్రభుత్వం పేర్కొన్న అంశాలను పరిశీలించి నమోదు చేస్తున్నారు. తనిఖీల్లో ఎన్ని పింఛన్లు అర్హత లేనివిగా తేలేయో అధికారులు వెల్లడించడం లేదు. ప్రభుత్వానికి నివేదిస్తున్నాం అని మాత్రమే చెబుతున్నారు. స్థానికంగా లేనివారు ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. ఎక్కువగా వికలాంగుల పింఛన్లపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఏలూరు జిల్లాలో 1,87,309 మంది పింఛన్లు అందుకుంటున్నారు. నెలకు రూ.80.33 కోట్లు పింఛన్ల సొమ్ము పంపిణీ జరుగుతోంది. పశ్చిమలో 2,28,362 పింఛన్లు ఉన్నాయి. ప్రతినెలా రూ.96.25 కోట్లు వరకూ పంపిణీ సాగుతోంది. సామాజిక పింఛన్ల సొమ్ము కింద నెలకు రూ.4 వేలను ప్రభుత్వం అందిస్తోంది. దీంతో భారం తగ్గించుకునేందుకు పింఛన్ల ఏరివేతకు దిగినట్లు తెలుస్తోంది. అర్హత లేని పింఛన్లు మాత్రమే తొలగిస్తారా.. లేక రాజకీయ కక్ష సాధింపుల్లో భాగంగా కూడా పింఛన్ల తొలగింపు సాగుతుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పింఛన్ల ఏరివేతకు ప్రభుత్వం దిగడంతో పింఛన్‌దారుల్లో గుబులు నెలకొంది.


సూరవరంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

ధాన్యం కొనుగోలుకు చర్యలు

కళ్లాల్లో ధాన్యం రక్షణకు 2 వేల టార్పాలిన్లు పంపిణీ

మరో 500 టార్పాలిన్లు సిద్ధం

రైతులు ఆందోళన చెందొద్దు

కలెక్టర్ కె.వెట్రిసెల్వి



ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో వర్షాల నేపథ్యంలో ధాన్యం దెబ్బతినకుండా వ్యవసాయ, పౌర సరఫరాలు, రెవెన్యూ శాఖల సిబ్బందిని అప్రమత్తం చేశామని కలెక్టర్ కె. వెట్రిసెల్వి చెప్పారు. తుపాన్ కారణంగా జిల్లాలో ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ధాన్యం రక్షణ కోసం రైతులకు టార్పాలిన్లు అందిస్తున్నామన్నారు. ఎక్కడా ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో రైస్‌మిల్లర్లకు కూడా ధాన్యం సేకరణపై తగు ఆదేశాలు జారీ చేశామన్నారు. రైస్ మిల్లులకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న ధాన్యాన్ని వెంటనే మిల్లులకు చేర్చేలా చూడాలని అధికారులను ఆదేశించినట్లు వివరించారు. వర్షాలను దృష్టిలో ఉంచుకుని అవసరమైన టార్పాలిన్లు రైతులకు అందుబాటులో ఉంచామని చెప్పారు. ప్రస్తుతం జిల్లాలో 22,826 మెట్రిక్ టన్నులు ధాన్యం రైస్‌మిల్లులకు తరలించేందుకు సిద్ధంగా ఉందని, వాటిని వెంటనే తరలించేలా రెవెన్యూ, పౌరసరఫరాలు, వ్యవసాయ శాఖాధికారులను అప్రమత్తం చేసినట్లు తెలిపారు. మరో 16,296 మెట్రిక్ టన్నులు కుప్పలు వేశారని, వాటి రక్షణకు రైతులకు ఇప్పటికే రెండు వేల టార్పాలిన్లను అందించామని, మరో 500 టార్పాలిన్లు సిద్ధం చేశామని, అవసరమైతే మరిన్ని టార్పాలిన్లు సేకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించిందని కలెక్టర్ తెలిపారు. రానున్న రెండు రోజుల్లో వర్షాలు కురుస్తాయన్న హెచ్చరికలను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయాధికారులు సమన్వయం చేసుకుని వారి సూచనల మేరకు వరి కోతలు చేపట్టాలని కలెక్టర్ రైతులకు విజ్ఞప్తి చేశారు. టార్పాలిన్లు, రైస్‌మిల్లులకు ధాన్యం తరలింపుల్లో రైతులకు ఏమైనా సమస్యలుంటే దగ్గర్లోని వ్యవసాయ, రెవెన్యూ, పౌర సరఫరాల అధికారులను దృష్టికి తీసుకెళ్తే పరిష్కరిస్తారన్నారు. రైతులు తమ సమస్యలను 18004256453 లేదా 08812-230448, 7702003584 నెంబర్లకు ఫోన్ చేసి తెలియజేస్తే అధికారులు పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు ఖరీఫ్ సీజన్లో రూ.450 కోట్లు విలువైన 1,95,366 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 25,493 మంది రైతుల నుండి కొనుగోలు చేశామన్నారు.

పిడిఎఫ్ విజయం సాబ్జీకి ఘన నివాళి

గోపీమూర్తి విజయోత్సవ సభలో నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉప ఎన్నికల్లో బొర్రా గోపీమూర్తి విజయం మాజీ ఎంఎల్‌సి, కీర్తిశేషులు షేక్ సాబ్జీకి ఇచ్చే ఘనమైన నివాళి అని పలువురు నేతలు అన్నారు. ఉప ఎన్నికల్లో గోపీమూర్తి ఘన విజయం సాధించిన సందర్భంగా సోమవారం సాయంత్రం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో విజయోత్సవ సభ, అనంతరం నగరంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్.రవికుమార్, ముస్తఫా ఆలీ మాట్లాడుతూ గోపీమూర్తి విజయానికి కృషి చేసిన యుటిఎఫ్ అలాగే బిటిఎ, ఎపిటిఎఫ్ 1938, ఎటిఎ, కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ నాయకత్వానికి, ప్రజాసంఘాల నాయకత్వానికి అభినందనలు తెలిపారు. సంఘాలతో సంబంధం లేకుండా అందరు ఉపాధ్యాయుల సమస్యలపై ఎంఎల్‌సి తన గళం వినిపిస్తారని తెలిపారు. రెండు సంవత్సరాల తర్వాత జరగబోయే ఎంఎల్‌సి ఎన్నికల్లో కూడా ఉపాధ్యాయులు ఇదే ఐకమత్యంతో, ఇదే పోరాట పటిమతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ ఈ విజయం ఊహించినదేనని, పిడిఎఫ్ ఎంఎల్‌సిలు ఉపాధ్యాయ సమస్యలపైనే కాకుండా సమస్యలతో బాధపడే అన్ని తరగతుల ప్రజల కోసం తమ గొంతు వినిపిస్తున్నారని, అందుకే తమ మద్దతు ఇవ్వటం జరిగిందని, భవిష్యత్తులో కూడా తమ మద్దతు ఉంటుందని తెలిపారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.సుభాషిణి, జిల్లా సహాధ్యక్షులు ఎస్.సుధారాణి, జిల్లా కోశాధికారి జివి.రంగమోహన్, ఆడిట్ కమిటీ కన్వీనర్ బి.మోహన్‌రావు, బిటిఎ రాష్ట్ర అధ్యక్షులు మనోజ్ కుమార్, బిటిఎ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.వెంకటేశ్వరరావు, ఎపిటిఎఫ్ 1938 ప్రధాన కార్యదర్శి జి.మోహన్‌రావు, సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్.లింగరాజు, డిఎన్‌విడి.ప్రసాద్, వివిధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం విజయోత్సవ ర్యాలీ యుటిఎఫ్ జిల్లా కార్యాలయం నుండి ఫైర్ స్టేషన్ సెంటర్ వరకు నిర్వహించారు. కార్యకర్తలందరికీ స్వీట్లు పంచి సంతోషాన్ని వ్యక్తం చేశారు. తొలుత మాజీ ఎంఎల్‌సి షేక్ సాబ్జి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



ఏలూరులో ఉపాధ్యాయుల విజయోత్సవ ర్యాలీ

బాలిక ప్రసవం ఘటన పర్యవేక్షణా లోపానికి నిదర్శనం

ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలారాణి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆధ్యాత్మిక సంస్థలో బాలిక గర్భవతి అయినా పట్టించుకోకపోవడం దారుణమని, దీనికి ఆ సంస్థ నిర్వాహకుల నిర్లక్ష్య వైఖరి గర్హణీయమని ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలారాణి విమర్శించారు. స్థానిక అశోక్ నగర్‌లోని ఓ మిషనరీ సంస్థలో ఆదివారం బాలిక ప్రసవించిన ఘటన సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఐద్వా బృందం సోమవారం ఆ బాధితురాలిని పరామర్శించింది. వివరాలు అడిగి తెలుసుకుంది. అనంతరం ఘటనకు కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా ఎస్‌పికి వినతిపత్రం అందించింది. ఈ సందర్భంగా శ్యామలారాణి మాట్లాడుతూ ఏలూరులో దయానంద సరస్వతి బాలికల వసతిగృహంలో ఘటనను మర్చిపోకముందే మళ్లీ ఇంకొక మిషనరీ సంస్థలో ఇలాంటి సమస్య ఎదురవడం చాలా బాధాకరమని అన్నారు. బాలిక గర్భవతి అయ్యి ప్రసవం వరకూ నిర్వాహకులకు తెలియకపోవడం అంటే పర్యవేక్షణా లోపం ఏస్థాయిలో ఉందో అర్థమవుతుందన్నారున. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జి.శారద, ఎం.అరుణకుమారి పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలను ఆపండి

ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండల కేంద్రమైన బుట్టాయగూడెంలో ఆదివాసీ చట్టాలకు విరుద్ధంగా సాగుతున్న అక్రమ కట్టడాలను రెవెన్యూ అధికారులు అడ్డుకోకుండా చోద్యం చూస్తున్నారని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ విమర్శించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకుల అండదండలతోనే ఈ అక్రమ నిర్మాణాలు సాగుతున్నాయని ఆరోపించారు. గిరిజన చట్టాలకు విరుద్ధంగా షాపింగ్ మాల్స్ నిర్మిస్తున్నా పంచాయతీ, రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. దీనిపై జిల్లా అధికారులు జోక్యం చేసుకుని అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాలని, ఉదాశీనంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

సిపిఎం జిల్లా మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - చింతలపూడి

ఈ నెల 13, 14, 15 తేదీల్లో బుట్టాయగూడెంలో జరగనున్న సిపిఎం జిల్లా 26వ మహాసభను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ పాండురంగారావు కోరారు. ప్రజాసంఘాలు కార్యాలయం వద్ద సోమవారం మహాసభ పోస్టర్‌ను నేతలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సూర్యకుమార్, సత్యనారాయణ, రాహుల్, అనురాధ, ధర్మారావు, గోపాల లక్ష్మి, వాసు తదితరులు పాల్గొన్నారు.

అదానీ ఒప్పందాల రద్దు కోరుతూ సిపిఐ ఆందోళనలు

ప్రజాశక్తి - చింతలపూడి

అదానీ కంపెనీలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసుకున్నటువంటి ఒప్పందాలను తక్షణం రద్దు చేయాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యాన సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వమించారు. అనంతరం తహశీల్దార్ ప్రమద్వరకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య మాట్లాడుతూ అదానీపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ వేయాలని, మణిపూర్ ఘటనపై పార్లమెంట్లో చర్చ జరపాలని, నిత్యావసరాల ధరలను అదుపు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేతలు తుర్లపాటి బాబు, దొంతా కృష్ణ, ఎస్‌కె.జానీ, ఎస్‌కె.కాలేషా, తాడిగడప మాణిక్యాలరావు, తక్కిలపాటి ప్రసాద్‌రావు, ఎం.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

కుక్కునూరు: అదానీ గ్రూప్ కంపెనీల అవినీతి, అక్రమాలపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు చేసి నిగ్గు తేల్చాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యాన స్థానిక ప్రధాన రహదారిపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మండల సమితి కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి, జిల్లా సమితి సభ్యులు కొన్నె లక్ష్మయ్య మాట్లాడారు. కార్యక్రమంలో నేతలు కె.బాబూరావు, ఎన్.నాగరాజు, వంజం విజయ్, సోయం మారయ్య పాల్గొన్నారు.



ఏలూరులో..

ఏలూరు అర్బన్: సిపిఐ ఆధ్వర్యాన సోమవారం స్థానిక పాత బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద డిమాండ్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్ మాట్లాడుతూ అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న పారిశ్రామికవేత్త గౌతమ్ అదానాపై కేంద్ర ప్రభుత్వం నోరు మెదపకపోవడం దారుణమన్నారు. మణిపూర్ అంశంలోనూ బిజెపి ప్రభుత్వ వైఖరి దారుణంగా ఉందని విమర్శించారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు బండి వెంకటేశ్వరరావు మాట్లాడగా నేతలు ఉప్పులూరి హేమశంకర్, కురెళ్ల వరప్రసాద్, పుప్పాల కన్నబాబు, కొండేటి బేబి, కె.కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.


చింతలపూడిలో..

తొలగింపులు నిరసిస్తూ మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లు ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

వైద్య ఆరోగ్య శాఖలో మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లుగా పని చేస్తున్న 104 మందిని అన్యాయంగా విధుల నుంచి తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ హెల్త్ అసిస్టెంట్లు సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ అసిస్టెంట్లు మాట్లాడుతూ 2003వ సంవత్సరం నుంచి తాము వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్నామని, 2012లో జిఒ నెం.273 అమలులో భాగంగా తమను తొలగించగా అప్పటి ప్రభుత్వం పునరాలోచించి ఫైనాన్షియల్ అప్రూవల్‌తో జిఒ నెం.1207 ఇచ్చి తిరిగి విధుల్లోకి తీసుకున్నారని తెలిపారు. మళ్లీ 2017లో జిఒ నెం.38060/2013 ప్రకారం కొంతమందిని తొలగించగా వారు హైకోర్టుకు వెళ్లడంతో తుది తీర్పు వచ్చేవరకు ఎవరినీ తొలగించొద్దని హైకోర్టు ఆదేశాలు ఇచ్చిందని, దీంతో తొలగించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకున్నారని తెలిపారు. అయితే ఇప్పుడు తెలంగాణ ఉమ్మడి హైకోర్టు 2013 కేసు కొట్టేయడంతో జిఒ నెం.1207లో ఉన్న తమను 38060/2013 లిస్టులో పెట్టి అన్యాయంగా తొలగించారని, వెంటనే తమను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో కనీసం తమను జిఒ నెం.1207లో పెట్టి అయినా తొలగింపు ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు డివి.రామకృష్ణ, ఎన్.తాతారావు, జి.చంద్రశేఖర్, జి.సురేష్, ఆర్.కృష్ణమూర్తి పాల్గొన్నారు.


నినదిస్తున్న మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లు

సమస్యల నిలయంగా కుక్కునూరు బస్టాండ్

కనీస సదుపాయాలు లేని వైనం
ప్రయాణికుల ఇబ్బందులు
పట్టించుకోని అధికారులు


ప్రజాశక్తి - కుక్కునూరు

మండల కేంద్రంలోని ఆర్‌టిసి బస్టాండ్ సమస్యలకు నిలయంగా మారింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం హయాంలో అప్పటి రోడ్డు భవనల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేసి ఆర్‌టిసి బస్టాండు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఆ కాలంలో కాంట్రాక్టర్స్ నామమాత్రంగా నాణ్యతా లోపంతో నిర్మాణాలు చేపట్టారన్న విమర్శలు ఇప్పటికీ వినవస్తున్నాయి. ప్రయాణికుల వల్ల రూ.కోట్లలో ఆర్‌టిసి ఆదాయం చేకూరుతున్నా వసతులు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. దూర ప్రాంతాలకు ప్రయాణించే ప్రయాణికులకు రాత్రి వేళల్లో సమయానికి బస్సులు రాకపోవడంతో బస్టాండులో నిద్రించే సదుపాయం లేక, మూత్రశాలలు లేక ప్రయాణికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత కొన్ని రోజులుగా ఎక్స్‌ప్రెస్, సూపర్ డీలక్స్ బస్సులు బస్టాండ్‌కు రాకపోవడంతో ఆయా పనుల నిమ్మితం సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి. అలాగే బస్టాండ్ ప్రాంగణం మొత్తం చెత్తాచెదారం, ముళ్లపొదలతో అపరిశుభ్రంగా తయారైంది. కుక్కలు, పందులు స్వైరవిహారం చేస్తూ ప్రయాణికులను బెంబేలెత్తిస్తున్నాయి. మూత్రశాలల్లో, మరుగుదొడ్లలో నీటి నదుపాయం లేదు. ఈ నేపథ్యంలో గతంలో మొదట కుక్కునూరు స్థానిక నివాసి గరబోయిన ప్రసాద్ తన సొంత ఖర్చుతో మరమ్మతులు చేయించారు. కుక్కునూరు ఉపసర్పంచి పిచ్చుక రాజు తన సొంత ఖర్చుతో మరమ్మతులు చేయించారు. ఆర్‌టిసి అధికారులు అభినందించి చేతులు దులుపుకున్నారే తప్ప బస్టాండ్ అభివృద్ధికి కావాల్సిన నిధులు కేటాయించి పట్టించుకున్న దాఖలేవు. ఇన్ని సమస్యలతో కూరుకుపోయిన బస్టాండ్‌ను ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.


కుక్కునూరు బస్టాండ్

బస్టాండ్ పూర్తిస్థాయిలో వాడుకలోకి వచ్చేదెప్పుడో!

లక్షలు వెచ్చించి నిర్మించిన ప్రభుత్వ భవనాలను అధికారులు నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారు. దీంతో ప్రజలకు ఉపయోగపడాల్సిన భవనాలు నిరుపయోగంగా మారుతున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ టిడిపి హయాంలో అప్పటి రోడ్డు భవనాల శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేసి కుక్కనూరులో ఆర్‌టిసి బస్టాండ్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ బస్టాండ్‌లోకి బస్సులు రావడం లేదు. ఒక్క బస్సు మాత్రమే వస్తుంది. భద్రాచలం నుంచి అమలాపురం, రాజమండ్రి, విశాఖపట్టణం వెళ్లే బస్సులు బస్టాండ్‌లోకి రాకుండా డైరెక్ట్ మెయిన్ రోడ్ నుంచి వెళ్తున్నాయి. దీంతో ప్రయాణికులు అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రయాణికుల సమస్యలను పలువురు ఇప్పటికీ చాలాసార్లు ఆర్‌టిసి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా కూడా అధికారులు పట్టించుకోకపోవడంతో ఎలాంటి ప్రయోజనం లేదు. ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన ఈ బస్టాండ్ ప్రస్తుతం దుమ్ముతో పేరుకుపోయింది. ఇలా దుమ్ముతో పేరుకుపోయి ఉండటం వల్ల క్రమక్రమంగా శిథిలావస్థకు చేరుతుంది. లక్షల రూపాయలు ఖర్చుపెట్టి నిర్మించిన బస్టాండ్‌లోకి బస్సులు రాకపోవడంతో ప్రయాణికులంతా బస్సుల కోసం రోడ్డు పక్కన నిల్చుని వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. సుమారు 20 గ్రామాల నుంచి వచ్చే ప్రజలు కుక్కునూరు నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్తుంటారు. వందల కిలోమీటర్లు ప్రయాణం చేస్తున్న ప్రయాణికులకు మధ్యలో ఎక్కడా కూడా టాయిలెట్ల సౌకర్యం లేకపోవడంతో బస్టాండ్ వద్ద కనీసం బస్సులను నిలిపితే అవసరాలు తీరుతాయని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్టాండ్ పూర్తిస్థాయిలో వినియోగంలోకి తేవాలని, బస్సులు బస్టాండ్ లోపలకి వచ్చేటట్లు చూడాలని కోరుతున్నారు.


జీలుగుమిల్లిలో స్వీట్లు పంచుతున్న సిపిఎం నేతలు

ఎంఎల్‌సిగా గోపీమూర్తి విజయంపై హర్షం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఎంఎల్‌సి ఉప ఎన్నికల్లో గోపీమూర్తి మొదటి ప్రాధాన్యత ఓట్లతో విజయం సాధించడంపై యుటిఎఫ్, సిపిఎం ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. ఓట్లు వేసి ఇంతటి విజయానికి సహకరించిన ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు. సిపిఎం ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు, సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్.కొండలరావు, రైతు సంఘం మండల కార్యదర్శి సిరిబత్తుల సీతారామయ్య, సూర్యారావు పాల్గొన్నారు.

చింతలపూడి : ఎంఎల్‌సి ఉప ఎన్నికల్లో ఘన విజయాన్ని సాధించిన బొర్రా గోపీమూర్తికి యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పురేటి శ్రీనివాసరావు సోమవారం ఓ ప్రకటనలో అభినందనలు తెలిపారు. ఇంతటి ఘన విజయాన్ని అందించిన ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయులు, అధ్యాపకులకు, గెలుపు కోసం నిరంతరం శ్రమించిన ప్రజా సంఘాలకు, అభ్యుదయ వాదులందరికీ కూడా ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌విఎస్.నారాయణ హర్షం వ్యక్తం చేస్తున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

ద్వారకాతిరుమల : ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల్లో గోపీమూర్తి విజయం సాధించడంతో యుటిఎఫ్ భవనం వద్ద విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సభలో మండలంలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులకు, సభకు విచ్చేసిన ఉపాధ్యాయ మిత్రులందరికీ యుటిఎఫ్ నేతలు అభినందనలు తెలిపారు.


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న వక్తలు

పాఠశాల విద్యార్థులకు ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి - దెందులూరు

పెదవేగి మం డలంలోని రామసింగవరం హైస్కూలులో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం సోమవారం ఘనంగా నిర్వహించారు. తల్లిదండ్రుల సమక్షంలో పిల్లల ప్రగతిని పరీక్షించారు. అనంతరం చిన్నారులకు ముగ్గులపోటీలు నిర్వహించారు. ప్రథమ బహుమతి సాధించిన డి.దేవిలక్ష్మికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు టివి.పద్మావతి, గ్రామ పెద్దలు ఎం.వెంకటేశ్వరరావు, సర్పంచి అడపా శ్రీను, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ సోనీ చేతులమీదుగా బహుమతి ప్రదానం చేశారు. ప్రధానోపాధ్యాయులు టివి.పద్మావతి మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టామని, తల్లిదండ్రులు కూడా రోజు బడికి పంపించే ఏర్పాటు చేయాలని కోరారు. తల్లిదండ్రులు, గ్రామపెద్దలు, దాతల సహకారంతో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించినట్లు చెప్పారు.

పాడి రైతులకు బోనస్

ప్రజాశక్తి - ముసునూరు

రైతులు విజయ పాల డెయిరీలో పాలు పోసి ఎంతో లబ్ధి పొందుతున్నారని పాలకేంద్రం సొసైటీ అధ్యక్షురాలు ఎం.పద్మ తెలిపారు. మండల పరిధిలోని రమణక్కపేట గ్రామంలో పాల ఉత్పత్తిదారుల సహకార సంఘంలో పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ కార్యక్రమం పాల సొసైటీ సంఘ అధ్యక్షురాలు మిద్దె పద్మ అధ్యక్షతన అందించారు. ఈ సందర్భంగా యూనియన్ బోర్డ్ డైరెక్టర్ శనగల వెంకటశివజ్యోతి చేతులమీదగా 173 మంది పాడి రైతులకు రూ.3,27,330 బోనస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లస్టర్ మేనేజర్ మాగంటి హరిబాబు మాట్లాడుతూ కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు, మేనేజింగ్ డైరెక్టర్ కొల్లి ఈశ్వర్‌బాబు మాట్లాడుతూ విజయ డెయిరీ దినదినాభివృద్ధి చెందుతూ రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ నాలుగు నెలల కాలానికి రెండో విడత బోనస్‌గా కృష్ణా మిల్క్ యూనియన్ పరిధిలో రూ.12.9 కోట్లను 1.52 లక్షల మంది పాడి రైతులకు చెల్లించినట్లు తెలిపారు. పాల శీతలీకరణ కేంద్ర పరిధిలోని 14 వేల మంది రైతులకు రూ.1,63,21,022 పంపిణీ చేసినట్లు తెలిపారు.

మత్తు పదార్థాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - ముసునూరు

మత్తు పదార్థాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రధానోపాధ్యాయులు పివిఎస్.రామకృష్ణ అన్నారు. మండలంలోని రమణక్కపేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి యూనిట్ ఇన్‌ఛార్జి రంగు శ్రీనివాస్, జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర కమిటీ సభ్యులు, జనసేన నూజివీడు నియోజకవర్గ నాయకులు పాశం నాగబాబు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర సన్నిధిలో పలువురు ప్రముఖులు

ముదినేపల్లి : జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన మండలంలోని సింగరాయపాలెం శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి కళ్యాణ మహోత్సవాలు సోమవారంతో నాలుగో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా మండల సర్వేయర్ శీలం రాజశేఖర్ రెడ్డి, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు దావు నాగరాజు తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా షష్ఠి ఉత్సవ కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో వీరికి స్వాగతం పలికి స్వామివారి తీర్థప్రసాదాలు అందించడంతో పాటు స్వామివారి ఫొటో అందించారు. వందలాదిగా యాత్రికులు తరలివచ్చారు. యాత్రికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ వీరభద్రరావు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ ఆర్.గంగాశ్రీదేవి, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

బైక్ ఢీకొని ఇద్దరు మహిళలకు గాయాలు

ఏలూరు స్పోర్ట్స్:బైక్ ఢీకొని ఇద్దరు మహిళలు తీవ్ర గాయాలపాలైన వంగాయగూడెంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం... ఏలూరు వంగాయగూడెం ప్రాంతానికి చెందిన మహిళలు నాగమణి, సీత సోమవారం బైక్‌పై బయటకు బయలుదేరారు. ఈ క్రమంలో ముగ్గురు యువకులు స్పోర్ట్స్ బైక్‌పై అతివేగంగా వస్తూ వారి బైక్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో నాగమణి, సీత తీవ్ర గాయాలపాలయ్యారు. వారిని స్థానికులు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం బంధువులు అక్కడి నుంచి ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై ఏలూరు ఆసుపత్రి వైద్యులు ఎంఎల్‌సిగా నమోదుచేసి ఆసుపత్రి అవుట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ముగ్గురు యువకులు స్పోర్ట్స్ బైక్‌ను సంఘటన స్థలంలో వదిలేసి అక్కడి నుంచి పరారయ్యారు.

తెలంగాణ మద్యం పట్టివేత

జీలుగుమిల్లి:మండలంలోని పి.అంకంపాలెం గ్రామ పరిసర ప్రాంతాల్లో సోమవారం జంగారెడ్డిగూడెం డివిజన్ ఎక్సైజ్ సిఐ కె.శ్రీనుబాబు ఆధ్వర్యంలో దాడులు చేశారు. ఈ దాడుల్లో గ్రామానికి చెందిన ఒక మహిళ వద్ద అక్రమంగా తెలంగాణ రాష్ట్రానికి చెందిన 30 మద్యం సీసాలను గుర్తించినట్లు తెలిపారు. మద్యాన్ని స్వాధీనం చేసుకుని మహిళపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సిఐ కె.శ్రీనుబాబు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

కొయ్యలగూడెం :పేకాట స్థావరంపై దాడి చేసిన పోలీసులు ఎనిమిది మందిని అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని కుంతలగూడెం సమీపంలో పేకాట స్థావరంపై ఎస్ఐ వి.చంద్రశేఖర్ తన సిబ్బందితో సోమవారం దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఎనిమింది మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.23 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.


అమెరికాలో ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్

అమెరికాలో ఎంఎల్ఎ రోషన్‌కుమార్‌కు సత్కారం

ప్రజాశకి - చింతలపూడి

అమెరికాలోని పిట్స్‌బర్గ్‌లోని ఎన్ఆర్ఐ టిడిపి కమిటీ ఎంఎల్ఎ రోషన్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు. ఆ వేడుకలను నగరంలోని ఎంఐఎన్‌టి ఇండియన్ రెస్టారెంట్‌లో నిర్వహించారు. ఈ మేరకు వివరాలను ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయం వారు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల అమలు తీరు గురించి వివరించినట్లు తెలిపారు. చింతలపూడి నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పెట్టుబడిదారులను ఎంఎల్ఎ రోషన్‌కుమార్ స్వాగతించినట్లు వివరించారు. నియోజకవర్గంలో చేసే ప్రతి అభివృద్ధిలో సహకరిస్తామని వారు తెలిపినట్లు చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధి పట్ల ఎంఎల్ఎ రోషన్‌కుమార్ ఆలోచనను వారు అభినందించినట్లు తెలిపారు.

నూజివీడు ఆర్‌జియుకెటి విద్యార్థుల ఘనత

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు ఆర్‌జియుకెటి ఇఇ శాఖకు చెందిన ఇన్నోవిటెక్స బృందం 2024 స్మార్ట్ ఇండియా హ్యాకథాన్‌లో స్మార్ట్ ఆటోమేషన్, సమస్యా ప్రకటనపై ప్రాజెక్ట్ రూపొందించి దేశవ్యాప్తంగా 500 జట్లలో మొదటి ఐదు జట్లలో ఎంపికైంది. ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు డి.స్రవంతి, ఎం.యశస్విని, బి.దివ్య, మూనూరు చంద్ర సిద్ధార్థ, కె.మనోజ్, డి.లోకేష్ తమ ప్రతిభతో డిసెంబర్ 12, 13 తేదీల్లో మైసూరులో జరిగే హ్యాకథాన్‌లో ప్రదర్శన ఇవ్వనున్నారు. బృందానికి మార్గనిర్దేశకులుగా అసిస్టెంట్ ప్రొఫెసర్ బి.సుబ్బినాయుడు వ్యవహరిస్తున్నారు. విద్యార్థులను డైరెక్టర్ డాక్టర్ అమరేంద్రకుమార్, ఇఇ హెచ్ఒడి శ్రావణి కనక కుమారి ప్రత్యేకంగా అభినందించారు.

డిఎస్‌సి అభ్యర్థులకు ఉచిత శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జిల్లాలో టెట్ పరీక్షల్లో అర్హత సాధించి మెగా డిఎస్‌సి-2024 పరీక్షలకు సిద్ధమవుతున్న స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జిటి అభ్యర్థులకు ఉచిత శిక్షణా తరగతులు ఏలూరు బిసి స్టడీ సర్కిల్‌లో ప్రారంభించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి ఆర్.నాగరాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన బిసి, ఎస్‌సి, ఎస్‌టి ఇబిసి/ఇడబ్ల్యుఎస్ అభ్యర్థులు బిసి స్టడీ సర్కిల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అభ్యర్థులు ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ, టిటిసి, బిఇడి, క్యాస్ట్, ఇన్‌కమ్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో బిసి స్టడీ సర్కిల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. టెట్‌లో వచ్చిన మార్కుల ప్రాతిపదికన ఎంపిక జరిగి అభ్యర్థులకు 60 రోజుల పాటు ఉచిత శిక్షణతో పాటు స్టయిఫండ్ ఒక్కొక్క నెలకు రూ.1500 చొప్పున రెండు నెలలకు రూ.మూడు వేలు, బుక్స్ ఫండ్ రూ.వెయ్యి అభ్యర్థులకు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు బిసి స్టడీ సర్కిల్‌లో లేదా 7569184335 సంప్రదించవచ్చని తెలిపారు.

మట్టి అక్రమ తోలకాలపై చర్యలు

పిడబ్ల్యు డిఇ రవీంద్ర

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

అక్రమంగా నిర్వహిస్తున్న మట్టి తోలకాలపై ఇరిగేషన్ శాఖ చర్యలు చేపట్టింది. స్థానికుల నుంచి ఫిర్యాదులు రావడంతో స్పందించిన పిడబ్ల్యు డిఇ రవీంద్ర సోమవారం రాజవరం సమీపంలోని పులపాకుల చెరువును ఎఇ సిహెచ్.భాస్కర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువులో అక్రమంగా చేపట్టిన మట్టి తోలకాల ప్రదేశాలను పరిశీలించి స్థానిక రైతుల వద్ద నుంచి స్టేట్‌మెంట్ స్వీకరించారు. పూర్తి దర్యాప్తు చేపట్టి అక్రమ మట్టి తోలకాలు నిర్వహించిన వ్యక్తులపై కేసులు నమోదు చేయడంతో పాటు వాహన యజమానులపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. సుమారు వందకు పైగా టిప్పర్ల ద్వారా మట్టిని అక్రమంగా తరలించినట్లు రైతులు అధికారులకు వివరించారు.

మచిలీపట్నం తరలిన ఎల్ఐసి ఏజెంట్లు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని ఎల్ఐసి కార్యాలయంలో ఏజెంట్లు మచిలీపట్నంలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎల్ఐసి ఏజెంట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, నాగమల్లి కుమార్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పాలసీలపై జిఎస్‌టి ఎత్తి వేయాలని, అన్ని పాలసీలపై ఏజెంట్లకు కమిషన్ పెంపు చేయాలని, అలవెన్సులు పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని చెప్పారు.

దోమల నిర్మూలన సామాజిక బాధ్యత

ప్రజాశక్తి - దెందులూరు

ఎక్కువ వ్యాధులు దోమ కుట్టడం వల్ల వస్తాయని, వాటి నిర్మూలన ప్రజలు సామాజిక బాధ్యతగా భావించాలని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు. పెదపాడు మండలంలోని వట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సోమవారం సందర్శించారు. స్థానిక వైద్యాధికారి డాక్టర్ భారతి ఆధ్వర్యంలో బిఎస్‌సి నర్సింగ్ విద్యార్థులకు కీటకాల ద్వారా వచ్చే వ్యాధులపై, ముఖ్యంగా ప్రమాదకరమైన కీటకమైన దోమల ద్వారా వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. ప్రపంచంలో 3,600 రకాల దోమలు ఉన్నాయని, కాని వాటిలో మూడు రకాల దోమలే చాలా ప్రమాదకరమని జె.గోవిందరావు సూచించారు. అవి మురుగునీరు, మంచినీరు నిల్వప్రాంతాల్లో పెరుగుతాయన్నారు. ప్రజలు వారానికోసారి మంచినీరు నిల్వ ప్రాంతాలను, తొట్టెలు డ్రమ్ములు, ఓవర్ హెడ్ ట్యాంకులు కడిగి మూతలు పెట్టుకోవాలని సూచించారు. మురుగు కాలవలో వాడేసిన ఇంజన్ ఆయిల్ గాని ఎబేట్ ద్రావణం కాని పిచికారీ చేయాలన్నారు. డ్రై డే కార్యక్రమం ఆచరించాలన్నారు. డెంగీ దోమ పగటిపూట కుడుతుందని, మిగతా దోమలు రాత్రిపూట కుడతాయని తెలిపారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ భారతి, హెల్త్ సూపర్‌వైజర్ సరళ, రవికుమార్, మలేరియా హెల్త్ అసిస్టెంట్ మేకా శ్రీనివాసరావు, ఆరోగ్య ఆశా కార్యకర్తలు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు సిద్ధార్థ జూనియర్ కళాశాల విద్యార్థులకు విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ వి.శ్యామ్ కెరీర్ గైడెన్స్‌పై సోమవారం అవగాహన కల్పించారు. డాక్టర్ శ్యామ్ ఉన్నత విద్యను అభ్యసించి, ఇంగ్లాండులోని పలు యూనివర్సిటీల్లో ప్రొఫెసర్‌గా పని చేయడంతో పాటు సివిల్ సర్వీసెస్‌లో ఐఎఎస్‌లకు ఉత్తమ శిక్షకుడిగా తన విధులను నిర్వర్తిస్తున్నారు. కెరీర్ గైడెన్స్‌లో భాగంగా డాక్టర్ శ్యామ్ నూజివీడు పరిసర ప్రాంతాల్లోని పలు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు పదో తరగతి అనంతరం ఇంటర్, డిగ్రీ, బీటెక్, పీజీ, ఇతర వృత్తి విద్యా కోర్సుల్లో ప్రవేశం పొందడానికి గల అవకాశాలు, కోర్సు పూర్తి చేసిన అనంతరం వారికి ఉన్న ఉద్యోగ అవకాశాలపై మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్యామ్ విద్యార్థులకు అవసరమైన విద్యాపరమైన వెబ్‌సైట్లు, సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, వృత్తి విద్య కోర్సుల్లో పట్టు కలిగి ఉండాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థి దశ నుంచి విద్యార్థులు నైతిక విలువలతో పాటు వ్యక్తిత్వ వికాసాన్ని కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వ, ప్రయివేట్ కళాశాలల్లో ఇంజినీరింగ్, మెడికల్, ఐఐటి, నీట్, ఐఐఎఫ్‌టి, బిజినెస్ స్కూల్స్‌లో సీట్లు సాధించడానికి ఏ విధంగా సమాయత్తం కావాలో విద్యార్థులకు వివరించారు. అనంతరం తాను ఇచ్చిన సందేశంపై పలు ప్రశ్నలు అడిగి సరైన జవాబులు చెప్పిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు కె.అనంతలక్ష్మి, కోశాధికారి ఎస్‌వి.రావు, సెక్రటరీ రాజేంద్రబాబు, డైరెక్టర్లు కె.తిరుపతిరావు, డిఎల్.రామలింగేశ్వరరావు, సిద్ధార్థ జూనియర్ కళాశాల డైరెక్టర్ రవిబాబు, విద్యార్థులు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

విద్యార్థి చికిత్సకు 'మానవత' ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పెదపాడు

కాలిన గాయాలతో బాధపడుతూ చికిత్స చేయించుకునేందుకు ఇబ్బంది పడుతున్న విద్యార్థికి పెదపాడు మానవత స్వచ్ఛంద సంస్థ ఆర్థిక సాయాన్ని అందించింది. మండలంలోని గుడిపాడు గ్రామానికి చెందిన హైస్కూల్ విద్యార్థి రాపాక ఇమ్మానుయేలు దేవదాసుకు ప్రమాదవశాత్తు కాలిన గాయాలయ్యాయి. ఇమ్మానియేల్ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటుంది. ఇమ్మానియేల్ ఇంటి వద్ద ఉండి కాలిన గాయాలతో బాధపడుతున్నాడు. పెదపాడు మానవత స్వచ్ఛంద సంస్థ కన్వీనర్ రామకృష్ణ విషయం తెలుసుకుని సోమవారం ఇమ్మానియేల్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. చికిత్స నిమిత్తం సంస్థ తరపున రూ.ఐదు వేలు ఆర్థిక సాయం అందించారు.



ఆర్థిక సాయం అందిస్తున్న మానవత సభ్యులు

ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ మానవత స్వచ్ఛంద సంస్థ సేవా కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థికి సహాయం చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పెదపాడు జెడ్ హైస్కూలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని మొఖసానరసన్నపాలెం (ఎంఎన్.పాలెం) గ్రామంలో టిడిపి కార్యకర్త బొర్రా సురేష్ ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని ఎఎంసి మాజీ ఛైర్మన్ కాపా శ్రీనివాసరావు సోమవారం పరామర్శించారు. సురేష్ చిత్రపటానికి నివాళు లర్పించారు. బాధిత కుటుంబానికి కాపా శ్రీనివాసరావు రూ.50 వేలు ఆర్థిక సాయంగా అందించారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు మాజీ అధ్యక్షులు అక్కినేని చందు, మాజీ సర్పంచి నువ్వుల రాము పాల్గొన్నారు.

సోనియాగాంధీ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఎఐసిసి మాజీ అధ్యక్షురాలు, పార్లమెంట్ సభ్యురాలు సోనియా గాంధీ 78వ పుట్టినరోజు వేడుకలు కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లంక రామ్మోహన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా సెక్రటరీ గౌడ రంగబాబు, దండుబోయిన చంద్రశేఖర్, నగర జనరల్ సెక్రటరీ ప్రతాప సుబ్రహ్మణ్యశర్మ పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

విద్యార్థి దశ నుంచే యువత అవినీతి పట్ల ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవడంతో పాటు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని ఇండియన్ యాక్ట్స్ అవేర్‌నెస్ వాలంటరీ ఆర్గనైజేషన్, మన హక్కులకై పోరాడు సాధించు ఉద్యమ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు అయ్యంకి సురేష్‌బాబు అన్నారు. అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం ఆగిరిపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవినీతి రహిత సమాజం - యువత పాత్ర అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ కె.యోహన్ అధ్యక్షత వహించగా ఇండియన్ అవేర్‌నెస్ యాక్ట్ వాలంటరీ ఆర్గనైజేషన్ కార్యదర్శి సయ్యద్‌లాల్‌సాహెబ్, మండల విద్యాశాఖాధికారి కె.ఆనంద్‌కుమార్, గ్రామ ప్రముఖులు చౌటపల్లి విక్టర్‌బాబు, పాతూరి రవి, దొండపాటి చిన్నవెంకటేశ్వరరావు (ఏసుపాదం), పి.పాపారావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా, వినతి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

రాష్ట్రంలో కార్పొరేషన్లలో, మున్సిపాలిటీలలో, నగర పంచాయతీలలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ విభాగం అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు సిబ్బంది సమస్యలను, రెగ్యులర్ ఉద్యోగ సిబ్బంది సమస్యలను, ఎన్ఎంఆర్ సమస్యలను పరిష్కరించాలని ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు కోరారు. ఈ మేరకు ఏలూరు కార్పొరేషన్ కార్యాలయం ఎదుట భోజన విరామ సమయంలో కార్పొరేషన్‌లో పని చేస్తున్న ఇంజినీరింగ్ ఉద్యోగ సిబ్బంది ఏలూరులో ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేసి కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు, అప్పలరాజు మాట్లాడుతూ జనవరిలో పిహెచ్ అవుట్‌సోర్సింగ్ వర్కర్లకు పండుగ మామూలుగా రూ.వెయ్యి చొప్పున ఇచ్చారని, సంవత్సరం గడుస్తున్నా ఇంజినీరింగ్ అవుట్‌సోర్సింగ్ వర్కర్స్‌కు ఇవ్వలేదన్నారు. వాటర్ వర్క్స్, వాటర్ సప్లై, స్ట్రీట్ లైటింగ్, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, కంప్యూటర్ ఆపరేటర్స్, ఎలక్ట్రీషియన్స్‌గా పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగ సిబ్బందికి కనీస వేతనం రూ.32 వేలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా కోశాధికారి పుప్పాల కన్నబాబు, ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు బి.నాగేశ్వరరావు, బి.నారాయణరావు, ఎస్ఎన్‌వి.సుబ్బారావు, ఎం.దుర్గారావు, బి.పెద్దిరాజు, సోమేశ్వరరావు, సిహెచ్.శ్రీనివాస్, సిహెచ్.హరినాథ్‌బాబు, దుర్గారావు పాల్గొన్నారు.

పాఠశాలకు సామగ్రి వితరణ

ప్రజాశక్తి - ఉంగుటూరు

బాదంపూడి ప్రభుత్వ పాఠశాలకు ఎస్‌బిఐ బాదంపూడి శాఖ రూ.మూడు లక్షలతో కంప్యూటర్లు, ఐరన్ బీరువాలు, టేబుల్స్, కుర్చీలు, ఆట వస్తువులను సోమవారం అందించారని ప్రధానోపాధ్యాయులు తోట రాజు తెలిపారు. సర్పంచి కంకట పద్మలీలవెంకట్రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బిఐ రీజనల్ మేనేజర్ రమేష్‌నాయుడు, మేనేజర్లు శ్రీనివాసరావు, రామచంద్రరావు, ఉప సర్పంచి దాసరి అప్పన్న, ఉపాధ్యాయుడు సలాది గణేష్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ నర్సాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
I.P.No.16/2023

Between:
పిటీషనర్ : ముచ్చర్ల శ్రీనివాస్
Vs
రెస్పాండెంట్స్ : 1.అల్లాడి లక్ష్మి
2.కొమర సుమన
3.కొమర తనూజ దుర్గా గాయత్రి
4.అఫీషియల్ రిసీవర్, ఏలూరు.

ప్రకటన

పై నంబరు పిటీషనులో 1వ రెస్పాండెంట్ ఇన్‌సాల్వెంట్‌గా డిక్లేర్ చేయమని మరియు ఇతర పరిహారముల నిమిత్తము పిటీషను దాఖలు చేసియున్నారు. సదరు పిటీషనులో పై రెస్పాండెంట్లుతో ఆస్థులపై లావాదేవీలు జరప రాదని, చెల్లవని ఇందు ద్వారా యావన్మందికి తెలియజేయడమైనది. సదరు వాయిదా తేది ది.**30-12-2024** ఉదయం 10-30 ని॥లకు పైకోర్టు వారి ఎదుట స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలియపరచుకోవలెను. లేనియెడల పిటీషనులో కోరిన పర్యవసానములు మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.
(కోర్టు వారి అనుమతితో)
నర్సాపురం **సిరిపురపు రాజేశ్వర ప్రసాద్**
ది.07-12-2024 అడ్వకేట్, నర్సాపురం, ప.గో.జిల్లా.
సెల్:939417662.

మహారాజశ్రీ పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం 10వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
A.S.No.8/2000

Between:
సాకా మోహనరావు ...అప్పీలెంట్
మరియు
సాకా నారాయణరావు వగైరా ...రెస్పాండెంట్లు
టు:
6వ రెస్పాండెంట్ : శ్రీమతి గొల్ల రాజమణి, భర్త హేమ చంద్రబాబు, C/o.జాన్ ఫెడ్రిక్, మట్లపాలెం, వయా దొడ్డిపట్ల, యలమంచిలి మండలం, ప.గో.జిల్లా.

పై నెంబరు అప్పీలులో 6వ రెస్పాండెంటు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు పంపించినా మీరు అందుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున ఇందుమూలముగా మీకు తెలియజేయునది ఏమనగా పై నంబరు అప్పీలు మీ హాజరు నిమిత్తం ది.18-12-2024 సం.తేదీ నాటికి వాయిదా అయివున్నది. సదరు తేది నాడు మీరు స్వయంగా గాని అడ్వకేట్ గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట ఉదయం 10-30 ని॥లకు హాజరై సంజాయిషీ తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున అప్పీలు తీర్మానం చేయబడునని ఇందు మూలముగా మీకు తెలియజేయడమైనది.
శ్రీకోర్టు వారి ఉత్తర్వుల మేరకు
పోలిశెట్టి వీర వెంకట నారాయణస్వామి
నర్సాపురం అడ్వకేట్, నర్సాపురం, ప.గో.జిల్లా.
ది.28-11-2024 సెల్: 9866094606

వేలం ప్రకటన
మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P.No.78/2018 in O.S.No.8/2013

Between:
దారపు నర్సింహమూర్తి ...పిటీషనర్/DHR
Vs
1.కూనపరెడ్డి వెంకట సత్యనారాయణ
2.కూనపరెడ్డి ప్రభు కుమార్
...రెస్పాండెంట్స్/JDRs

పై నెంబరు ఇ.పి వారంటు అమలు గ్రంథములో డిక్రి బాకీ వసూలు నిమిత్తం ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తులను శ్రీకోర్టు వారు ది.**24-12-2024**వ సం॥రం తేదీన ఉదయం 10.30 ని॥ల లగాయితు వేలం వేయబడును. ఆసక్తి గలవారు వేలం పాటలో పాల్గొని ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తులను పాడుకొనవచ్చును.

షెడ్యూలు

1వ ప్రతి : పశ్చిమ గోదావరి జిల్లా, నరసాపురం మండలం, నరసాపురం సబ్-రిజిస్ట్రార్ వారి పరిధిలో చేరిన రుస్తుంబాద గ్రామపంచాయితీ ఏరియా, జిరాయితీ పల్లం ఆర్.యస్.నెం.353/1రు పూరా య.1.14 సెంట్లలో య.0.50 సెంట్లు లుకు హద్దులు.
తూర్పు : పంట బోది. **దక్షిణం :** కూనపరెడ్డి మంగాయమ్మ గారి భూమి. **పడమర :** పంట బోది. **ఉత్తరం :** మండ వీర వెంకట సత్యవతి గారి భూమి.
డి.హెచ్.ఆర్.విలువ రూ.2,50,000/-
అమీనా విలువ రూ.4,00,000/-
సబ్-రిజిస్ట్రార్ విలువ రూ.9,00,000/-
విత్ ఆల్ యాజిమెంటరీ రైట్స్.

2వ ప్రతి : పశ్చిమ గోదావరి జిల్లా, నరసాపురం మండలం, నరసాపురం సబ్-రిజిస్ట్రార్ వారి పరిధిలో చేరిన రుస్తుంబాద గ్రామ పంచాయితీ ఏరియా, జిరాయితీ పల్లం (ఆర్.యస్.నెం.350/2) ఆర్.యస్.నెం.350/2ఎ పూరా య.0.84 సెంట్లు, రెండు నెంబర్లలో పూరా య.1.68 సెంట్లలో య.0.42 సెంట్లుకు హద్దులు.
తూర్పు: పంట బోదికి చేరిన వర్దనపు నారాయుడు గారి భూమి. **దక్షిణం:** యర్రంశెట్టి ఏసుబాబు గారి భూమి. **పడమర:** జక్కంశెట్టి తిల పుష్పాంజలి గారి భూమి. **ఉత్తరం:** అనసూరి చంద్రరావు గారి భూమి.
డి.హెచ్.ఆర్.విలువ రూ.2,00,000/-
అమీనా విలువ రూ.3,36,000/-
విత్ ఆల్ యాజిమెంటరీ రైట్స్
సబ్-రిజిస్ట్రార్ విలువ రూ.7,56,000/-
విత్ ఆల్ యాజిమెంటరీ రైట్స్.

వేలం తేది: 24-12-2024
కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం
నల్లిమిల్లి జోసెఫ్
పిటీషనర్/DHR తరపున అడ్వకేట్
నరసాపురం నరసాపురం -534275,
తేది.09-12-2024 ప.గో.జిల్లా.